# వెలుగు - నీడలు

తెల్లవారింది.

బద్ధకంగా లేచాను.

రాత్రి చాలాసేపు నిద్ర మేలుకుని వ్రాసిన విక్రమోర్వశీయ పద్యకావ్యపు స్వర్గీయ దృశ్యాలు తియ్యని స్మృతుల్ని కదలిస్తున్నాయి.

ఊర్వశీ దివ్యసౌందర్యం నా పద్యాల్లోకి కాంతిధారగా ప్రవహించి ఒచ్చినట్టనిపించింది.

పురూరవ చక్రవర్తి మధుర స్నేహ సల్లాపాలతో నా కావ్యం పులకరిల్లినట్టు తోచింది.

సుధర్మలో, భరతముని ప్రయోగించే నూతన నాటికలోని నాయికా పాత్ర ధరించి, అప్సరః సుందరి, స్త్రీరమణీయతా సర్వస్వంగా రంగభూమికి అవతరించినప్పుడు వ్రాసిన ఈ పద్యం –

"రేషను షాపు తీసే వేళయింది. చప్పున కాఫీ పుచ్చుకువెడతారా? పాపం రాత్రి చాలాసేపు మేలుకున్నారు. ఏం చెయ్యను? తెచ్చుకునే రోజు తప్పదు".

ఇంద్రసభకు బదులుగా మా చాలీచాలని అద్దెవాటా, నాట్యఉజ్జ్వలరూపిణి ఊర్వశికి బదులుగా నిత్య సంసార యాత్రలో నలిగే పాతగళ్ల చీర బ్రాహ్మణీ, కనబడేసరికి నా పురూరవ చక్రవర్తి హిందూదేశంలో ఒక నాగరిక పట్టణంలోని ఆరోనెంబరు రేషను షాపు దగ్గరకు నడవలేక చట్టున తప్పుకున్నాడు.

ఎదురుగా కనబడే సిమెంటు కంపెనీ కాలెండరు మీద 45 సంవత్సరం 18వ తారీఖు వాస్తవ జగత్తులో కనబడేసరికి నా ఒళ్ళు దహించుకుపోయింది.

బియ్యం లేవని తెలియగానే ఆకలి ఎక్కువగా వుంది. అంత దివ్యసౌందర్య భూయిష్ఠ కళాసంపదను భావనాసంపత్తితో పుడమికి అవలీలగా అవతరింపజేయగల ఆంధ్ర కవీశ్వరునకు ఆకలి కలిగిందంటే ఎంత నీచం!

కానీ వేస్తోంది! ఎవరితోనూ అనకండి. బాగుండదు.

మహేంద్రుడుగాని, అమరవేశ్యగాని ఈ కరువు రోజుల్లో నాకెట్టి సహాయం చెయ్య లేరని రూఢిగా తెలిశాక మాసిపోయిన కేన్వాస్ సంచీ పుచ్చుకొని కాళ్లీడ్చుకుంటూ బజారుకు నడిచాను.

ఈనాటి కవి నిజస్వరూపం - ఎదుట నిలువుటద్దం లేకపోయినా - స్ఫుటంగా నాకళ్లల్లో ఆనింది.

రోడ్డు ఎక్కేసరికి జమీందారు గారి కొత్తకారు రంయిమని నడిచేవారి కంట్లో దుమ్ము కొట్టి పరుగెత్తింది.

చట్టున టౌనుహాల్లో జరగబోయే గౌరవార్ధపు టీపార్టీలోని తేనీటి సువాసన నా మెదడుకు తగిలి వికారపెట్టింది.

పట్టణానికి ఒకవైపున చాలీచాలని కొలబత్తెపు బియ్యం కోసం తొక్కిడిపడే దౌర్భాగ్యుల కోలాహలమైతే - ఇంకోవైపున బలిసిన లంచాల చేతులు కమ్మని వెచ్చని పదార్థాలను సమృద్ధిగా సిల్కుసూట్ల బొజ్జల్లోకి నెమ్మదిగా జార్చడం గమ్మత్తుగా జ్ఞాపకం వచ్చి నవ్వాను.

రోడ్డుమీద జనప్రవాహం ఏవైపు నడుస్తున్నదో తెలియలేదు.

అప్పుడే రేషనుషాపు తెరిచారు.

అధికారులు పిచ్చుతవ్వలతో మట్టిరంగు బియ్యం రూపంలో న్యాయాన్ని పంచుతున్నారు, పవిత్ర ఆర్యావర్తభూమిలో -

చప్పున షాపులోకి చొరబడడానికి వీలులేదు. నరశరీరాల గోడ అప్పటికే బలంగా ఏర్పడి వుంది.

కొంతసేపు గడిచింది. ఉవ్వెత్తుగా మానవ దేహభిత్తిక బీటవారి లోపలనుంచి ఒక కలకలం వినపడడం మొదలుపెట్టింది.

మేం ఆశ్చర్యపడి చూస్తున్నాం.

గుమస్తా కీచుగొంతుకతో అరుస్తున్నాడు అయిదు నిమిషాల తర్వాత కీచుగొంతూ, ఇద్దరు నౌకర్లూ చేతుల్లో శక్తి అయిపోయేదాకా బాది ఒక పదార్థాన్ని రోడ్డుమీదికి తెచ్చి విడిచిపెట్టారు.

అది నెమ్మదిగా కదిలి అంటున్న రోడ్డు దుమ్ము దులుపుకుని, ఊడిపోయిన చిగురుల తలగుడ్డను సవరించుకొని వెనక వాలికలై ముందు మానసికలతో నిండిన చొక్కాతో పాలిపోయిన ముఖంమీద మొహమాటంగా పెరిగిన పేడి గెడ్డంతో మూటలు మోసే కూలీగా లేచి నించుంది.

వాడు ఏమీ జరగనట్టు, తగిలినచోట చేతితోనైనా తడుముకోకుండా ముందుకు

నడిచి పక్క తూముమీద కూచున్నాడు.

బియ్యం కొన్నాను. ఇటూ అటూ చూశాను. క్లుప్తమైన వారైతే స్వయంగానే పట్టుకు పోవచ్చు. కాని...

"బాబూ, కూలీ కావాలా?" - పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"ఎంత?'

"...బేడ"

"పావలా ఇస్తాను. పట్టుకో"

చాలా సహజంగా అన్నాను. కాని - తిన్న దెబ్బలకన్న ఆ మాట సలిపింది గాబోలు. సిగ్గుపడి తలఒంచుకొని మూట పుచ్చుకున్నాడు.

వెనకనించి అందుకున్నారు - "మంచివాడు దొరికాడు"

"సగం బియ్యం తోవలో తినేస్తాడు"

"పచ్చి దొంగవెధవ"

"ఊరికే తన్నారా గుమాస్తాగారు?"

"ఇంత కూలి ఎందుకు?"

"ఏం! బేడ అడిగితే పావలా ఇచ్చే మహానుభావులు దొరికాక..."

"సామ్యవాదులండీ!"

దూరమై ఇక వినపడలేదు.

"నీ పేరెవరమ్మా"

నడుస్తూ తోచక వేసిన ప్రశ్న.

"సన్నాసండి"

"పద"

చేతిలో పడ్డ పావలా కాసుచూసి సన్నాసి మొహం మరింత పాలిపోయింది. స్వార్థా వరణం చీల్చి నిజమైన మనస్సు తెరచి చూపితే మనుషులు ఎంత దగ్గరకు వస్తారు! కాని నమ్మం. అదే ఈనాటి నాగరికతలో ఉన్న విశేషం!

కొంతసేపటికి సన్నాసి ముఖం సంతోషంతో నల్లబడి - పురూరవ సార్వభౌముడు ఖాళీచేసిన చోట వెళ్ళి కూర్చుంది.

•••

సోమవారం సంత.

ఫెళ్ళున సాగుతోంది.

ఇంద్రనీలమణి రాసులవంటి నీటి వంకాయ గుట్టలూ, పచ్చలవంటి బచ్చలికూర స్తూపాలు, కెంపుల వంటి ఉల్లిగడ్డల పర్వతాలూ, సాయంకాలపు ఈరెండ తగిలి మిల మిలా మెరుస్తున్నాయి.

విజయనగర సామ్రాజ్యం ఉచ్చదశలో వెలిగేటప్పుడు వర్తకులు రాజవీధిలో రత్నాలు రాసులుపోసి పట్టు బాలీసుల కానుకుని అమ్మడం చూశానని అబ్దుల్ రజాక్ అన్న మాటలు నా నాటికి ఆంధ్రదేశంలో సోమవారం సంతగా ప్రత్యక్షమైనందుకు సంతోషిస్తూ, మనకు ఏరకం రత్నాలు ఎన్ని వీశలు కావాలో నిర్ణయించలేక ఆలోచిస్తున్నాను. నిండా అన్నం లేని ప్రజలకు ఇన్ని కూరలెందుకో?

అరటికాయల దుకాణం దగ్గిర ఛెళ్ళుమని చప్పుడయింది.

తిరిగి చూశాను.

చుట్టూ చేరిన నలుగురు 'పెద్దమనుషుల' మధ్య మా కథానాయకుడు సన్నాసి కన పడ్డాడు. అధికారముద్ర తగిలినట్టు దవడ ఎర్రగా కందింది.

ఒక కాపు పెద్ద చేత్తో కూరల బరువు మూట పట్టుకొని రెండో చేత్తో సన్నాసిని ఒడిసి పట్టుకుని అన్నాడు.

"యెదవలు... కూలిపని చేసుకోరాదూ, దొంగ గడ్డి తినకపోతే... మూట లాగు తున్నాడు. సవట..."

కాలెత్తి, మళ్లా దయదలచి ఊరుకున్నాడు.

గాంధీగారి అహింసా సిద్ధాంతం మీద చాలా గౌరవం ఉన్నవాడు.

"తప్పు కాదండీ! - లేకపోతే - అడుక్కోవాలి.."

మూకలో ముందున్న పంగనామాల తగుమనిషి పళ్లులేని బోసినోటితో దేశంలోని నిరుద్యోగ నిర్మూలన రహస్యం నిమిషంలో పరిష్కరించి ఊరుకున్నాడు.

సన్నాసికి ఊపిరి తిరిగింది.

"మూట తెమ్మన్నారా బాబూ! అణా డబ్బులిప్పించండి ఇంటికాడికి. అందుకోసమే మూట ముట్టుకుంటే..."

"ఛప్! నోరు ముయ్యి దొంగ గాడ్దె! నాకు నీ కూలెందుకురా? ఇలాటివి పదిమూటలు పట్టికెళ్లగలను. బుద్ధిగా బతుకు. తన్నులు తినేవు..." అని వెళ్లిపోయాడు.

"మంచిపని చేశాడు. చూస్తే కూలి, చూడకపోతే నాలి. నాలిముచ్చు వెధవలు" ఒక శ్రోత్రియ బ్రాహ్మణోత్తముడు అరటాకుల కొట్టు దగ్గర్నుంచి తన అభిప్రాయం వెల్లడిం చాడు.

మళ్ళా మామూలుగా జనప్రవాహం సంతలోకి ప్రవహిస్తోంది.

అలజడి క్రమంగా తగ్గింది.

సన్యాసి నెమ్మదిగా ఏదో కాలికింద గుచ్చుకున్నట్టుగా ఒంగి ఇందాకటి ఘర్షణలో పెద్దకాపు రొంటినుంచి జారగా ఇంతవరకూ ఎడంకాలి బొటనవేలితో తొక్కిపెట్టిన వస్తువును పదిలంగా తీసి బజార్లో నల్లమందు కొట్టువైపు చరచరా నడిచాడు.

● ● ●

సిరావర్ణంలా చీకటి అలముకుంది.

రాత్రి పదిగంటలు దాటింది.

మబ్బుగా వుంది.

చలిగాలి చెలరేగింది.

వెచ్చని అన్నం తిని ఇనప్పెట్టెలలాంటి గదుల్లో కాశ్మీర వాలువల్లోకి కమనీయ గాథల్లోకి వెళ్ళిపోయేవారికి ఆరాత్రి ఎంత వరప్రసాదం! ఒక్క చలిరాత్రి చల్లారిపోయే ఎన్ని గుండెల్ని జ్వలింపజేస్తుంది.

సంతపాకలు తప్ప ఊరంతా, ఒత్తిగిలడానికి కూడా బద్ధకంగా నిద్రపోతోంది.

పగలంతా బైరాగి వేషంతో తిరిగే ముసలి జంగం, పాతపడవ ఒక రేవుకు చేరినట్టు సంతపాకల్లో ఒక మూలచేరి కొంత గడ్డి పోగుచేసి మంటవేసి గుడాకుపొగ తాగుతూ దగ్గుతున్నాడు.

చవకరకం కల్లు తాగి, యెవరో పడమటి యాసతో కీచులాడి తిట్టుకుని నోరునొప్పెట్టి సంతపాకల నాపరాళ్ళమీద ఒరిగారు.

అక్కడికి కొంతదూరంలో చింతచెట్టు కింద బసచేసిన ఎఱుకల కుటుంబంలోంచి ఎఱుకల పిల్ల నీలాలు చట్టున మెళకువ వచ్చి కూచుంది. అన్ని ముష్టి కుటుంబాలూ ఒళ్లు తెలియకుండా నిద్రపోతున్నాయి. ఎటుచూసినా కారు చీకటి రాత్రి, పక్కని తల విరబోసుకున్న దెయ్యంలా పెద్ద చింతచెట్టు.

భయమేసింది.

తల్లిని లేపుదామని ఊరుకుంది.

"భయం మాటకేంగాని, ఈ చీకటిరాత్రులు పడుచు మనస్సులకి ఎంత సరదాగా ఉంటాయి" అనుకుంది నీలాలు. గొంతుగా కూచుని నిద్రలో చెదిరిన జుట్టు ఎగదోసుకుంటూ.

సందేళ తాగిన గంజి ఉడుకు చల్లారిపోయింది. ఆకలి మండిపోతున్నది.

పడుచు పిల్లకు చారెడు గంజినీళ్ల బలం ఎంతసేపు?

చలిగాలి రివ్వున కొట్టింది. లేతాకులా గజగజలాడి ఒళ్ళంతా కప్పని గుడ్డతో వక్షాన్ని

కప్పబోయింది.

రెండు చేతుల్నీ బలంగా 'ఇంటూ' గుర్తులా చేసి గుండెలకు అదుముకుంది.

మెఱుపు మెరిసింది.

ఆకలి భగ్గుమంది.

లేచి నుంచుంది.

ఎదురుగా మంచం మిఠాయి పెట్టె కొట్లు కనపడుతున్నాయి. మూసి వున్న కొట్టు లోంచి మిఠాయి ఎలా వస్తుంది!

ఏమో!

ఆకలి ఉంది మరి –

నవ్వింది.

నున్నని నల్లశానపురాయిలా నిగనిగలాడే ముఖంలో పళ్ళు మెరిశాయి.

అడవిలో ముళ్ళ పొదలమీద అడవి మల్లెపూలు జ్ఞాపకం వస్తాయి.

ఎవరు చూశారు?

చుక్కలు లేని ఆకాశం సిగ్గుపడింది.

పెట్టెకొట్టు అడుగున ఏ బల్లఐనా ఒదులుగా ఉండకూడదూ?

"దొరికితే చంపేస్తారు?"

"ఈ ఆకలి బతకనిస్తోందా?"

'అది మొగోళ్ళ పని"

"ఆకలికి మొగా... ఆడా ఉందా?"

ఒక మొగాడు ఎట్లాగో తంటాలుపడి కొట్టు బద్దలుకొట్టి 'ఇదిగో మిఠాయి' అంటే ఎంత బాగుండును అనుకుంది.

కొట్టుపక్క ఏదో నీడ కదిలింది. గుండె పట్టుజారినట్టనిపించింది. మనస్సు కూడదీసు కుని కొట్టుపక్క నక్కి కూచుంది.

రెండు నిమిషాలు నిశ్శబ్దం.

కొట్టు వెనక బల్ల ఊడలాగుతున్నట్టు వినబడి ప్రాణం కుదుటపడి మెల్లగా అక్కడికి మోకాళ్ళమీద పాకి తలయెత్తింది.

నీడ పారిపోయింది.

నీలాలు నాలిక కరుచుకుంది.

నోటిదగ్గర కూడు జారిపోయిందని విచారించింది.

నిటాగ్గా నుంచుని చూడగా వెనకతట్టు ఒక బల్ల సగం ఊడి ఉందిగాని ఒక మేకు పట్టుమాత్రం ఎక్కువగా వుంది.

బలంకొద్దీ బల్లను గుంజి లాగింది. కదల్లేదు. ఒక కాలితో అడుగుభాగం తన్నిపెట్టి చెక్క పెకలించింది. బల్ల చప్పునద ఊడి నీలాలు వెనక్కు పడిపోయింది. నీడ రెండు చేతులూ చాపి పట్టుకొని నించోబెట్టింది. చెమటపట్టిన చల్లటి వెన్నుమీద వెచ్చని చేతులు బిగువుగా అనుకునేసరికి ఆ స్పర్శతో ఒక విశ్వరహస్యం అర్థమైపోయినట్టు తోచింది ఇద్దరికీ.

నీరసంతో అంతవరకూ చురుకుగా కదలలేని రెండు చేతులూ కొత్తగా చిగిర్చినట్టు పనిచేస్తున్నాయి.

నీడ నెమ్మదిగా లోపలికి దూరి చీకట్లో వెదకి ఒక వేరుసెనగ నూనె మిఠాయి జంగిడి పట్టుకుంది.

నీలాలు సాయంచేసి ఇవతలకి లాగింది.

కొన్ని లోపలికి జారిపోయినా జంగిడితో కొన్ని వచ్చాయి. నీలాలు జంగిడితో కలిపి తినేసేటంత ఆకలితో ఉంది. నీడకు ఇద్దర్నీ కలిపి తిందామని ఉంది.

"కూకో. తినేసేపోదాం. మళ్ళా మోతెందుకు?"

"సాల్లే. ఎవరన్నా సూత్తే పక్కలిరుగుతాయి"

"ఈరోజు వొరసే ఇల్లా వుంది"

"మొగసన్నాసికే ఇంత పిరికైతే ఇక ఆడోళ్ళకంతా కూడే.."

"ఆసి.. నీవంటే... నీలీ! కనిపెట్టేశావ్"

"ఓరి... నీవంట్రా! పోల్చేశావు"

"నడూ... నాన్చక..."

అటూ ఇటూ చూసి నీలాలు కర్రపళ్లెం చేతిలో పెట్టింది. "తూరుపెంపు పాకకాడ ఎవరూ నేరు. అక్కడికి పోదాం" నడుస్తున్నాడు.

పక్కదుకాణం బడ్డీమీద మనిషి కదిలినట్టయింది. కుక్క బొంయిమంది.

సన్నాసి చెంగున మురుక్కాలవ దాటి పరిగెత్తబోయాడు. కాలుజారి మిఠాయి జంగిడి కాలవలో పడిపోయింది.

మెల్లగా మొగవాడు అరుగెక్కి నిరాశగా ఒకమూల ఇరికి కూచున్నాడు.

నీలాలు వెళ్లి దగ్గరగా కూచుంది.

ఏమి మాట్లాడాలో ఇద్దరికీ తెలియలేదు.

సన్నాసి నీరసంగా తలగుడ్డ నేలమీద పరిచి ఒరుగుతూ అన్నాడు. "ఒట్టి అలుపు

మిగిలింది..."

"నీ కరమ్మ"

అద్వైతసారం ఒంటబట్టిన వేదాంతిలా నీలాలు వెటకారంగా నవ్వి వాడి భుజంమీద కొట్టింది.

నీలాలు కళ్లు ఆ కటిక చీకట్లో తెల్లనిప్పుల్లా మెరిశాయి.

"ఈయేల కింతే పెట్టిపుట్టాం"

'ఉపనిషన్మధు' వొలికినచోట పుట్టినవాడు పలికాడు.

కాని వేదాంతికి కడుపు మండుతోంది. కన్నులు ఎంత నులిమినా మూతపడ్డం లేదు.

"మిఠాయీ పోయి ఎఱ్ఱి యేదాంతం మిగిలిందిరా మనకి..." అని మరింత దగ్గరగా జరిగి, దాచిన ఒక్క మిఠాయి ఉండ రెండు ముక్కలు చేసి ఒకటి వాడిచేతిలో పెట్టి తనొ కటి తిని కూచుంది.

చిటపట చినుకులు ప్రారంభించి టిన్ రేకు దారుణంగా ధ్వనిస్తోంది.

చలిగాలి రివ్వున కొట్టింది.

నీలాలు మాటాడకుండా ఒణికింది.

వర్షం ముదిరిపోతోంది.

సన్నాసి మూలిగి, జల్లుకొట్టని వెంపుకి పక్కమార్చి బద్ధకంగా కళ్ళు మూసుకున్నాడు. తగినంత గుడ్డలేని వెచ్చని వక్షస్థలం చుఱ్ఱున తన బుజానికి తగిలేసరికి మానవుడి తర తరాల నాటి ఉష్ణవాంఛలతో ఒక్కసారిగా వాడి మనస్సు అంటుకుంది.

తన ఒంటిమీద గాయాలను ఒక్కటొక్కటిగా మృదువుగా తాకే మెత్తని రెండు చేతు లనూ తీసి కళ్ళకద్దుకున్నాడు. బుద్ధి ఎరిగినప్పటినుంచీ ఈసడింపులూ, అవమానాలూ మాత్రమే చూసిన వాడి గాజుకళ్లు తలవని తలంపుగా చెమ్మగిల్లాయి.

వాన కురుస్తూనే వుంది.

మళ్ళా తెల్లవారుతుందని, ఆ చల్లని చీకటిరాత్రి దయతో వాళ్ళకు జ్ఞాపకం చెయ్యడం మానేసింది.

**(1948 ఏప్రిల్ - భారతి)**